క్లుప్తంగా

శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ



లడ్డూ ప్రసాదానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం (టీటీడీ)లో శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తులు ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు చేసిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని పద్మావతి, గోదాదేవి, ఆంజనేయ స్వామి వార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి నామ సంకీర్తనలు, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లడ్డూ విక్రయాలు జోరుగాసాగాయి.

శ్రీకృష్ణుడిగా జగన్నాథుడు



భీమునిపట్నం: జగన్నాథ స్వామి శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చారు. భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా శనివారం స్వామిని కృష్ణావతారంలో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం జాతీయరహదారి పక్కన అభయాంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉమా నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో కంటి, దంత వైద్య సేవలు అందించనున్నారు. వివరాలకు 99081 18050, 96035 63579 నంబర్లలో సంప్రదించాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బమ్మిడి శ్రీతారక్ కోరారు.

మందుబాబులకు రూ.3.80 లక్షల జరిమానా

తగరపువలస: ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మందిపై అక్కడి ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని శనివారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని ముందు హాజరుపరిచారు. ఆమె వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున మొత్తం రూ.3 లక్షల 80 వేలు జరిమానా విధించారు.

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రులు



హోమం నిర్వహిస్తున్న పీఠం వ్యవస్థాపకుడు కల్యాణ చక్రవర్తి

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేట శ్రీవిద్యా శక్తిపీఠంలో వారాహి నవరాత్రులు శనివారంతో ముగిశాయి. గత నెల 26న ప్రారంభమైన నవరాత్రులు మహా పూర్ణాహుతితో ముగిసినట్లు పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా విశేష అర్చనలు నిర్వహించారు. వారాహి అమ్మవారి మాలాధారణ చేసిన భక్తులు దీక్ష విరమించారు. ఈ సందర్భంగా పీఠం ఆవరణలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలి

పీఎం పాలెం: కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని సీఐటీయూ మధురవాడ జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు కోరారు. ఏడో వార్డు ద్రోణంరాజు కల్యాణమండపం ఆవరణలో శనివారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికలోకం ఉద్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య, క్లాప్ డ్రైవర్లు, లోడర్స్ తదితర కార్మికులు, మున్సిపల్ యూనియన్ జోన్ కార్యదర్శి రామప్పడు, వార్డు అధ్యక్షుడు రాంబాబు, క్లాప్ డ్రైవర్ల సంఘం నాయకులు ఎం.రాజు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

రవాణా సాధనాలు అంతగా అభివృద్ధి చెందని కాలంలో ఎడ్ల బళ్లే ప్రయాణ సాధనాలుగా ఉపయోగపడేవి. తీర్థయాత్రలకు, ఒక గ్రామం నుంచి మరొక గ్రామంలో బంధువుల ఇళ్లకు వెళ్లడానికి, సంతలు, వ్యవసాయం, వస్తు రవాణాలో ఇవి కీలకపాత్ర వహించేవి. అప్పట్లో రోడ్డు నిండా కనిపించే ఈ నాటు బళ్లు ప్రస్తుతం చూద్దామన్నా ఒక్కటి కూడా కనిపించడం లేదు.



అలనాటి జ్ఞాపకం ఎడ్లబండి

SUNDAY SPECIAL

నాటి ప్రధాన రవాణా సాధనం • నేడు పల్లెల్లోనూ కానరాని వైనం

మోటారు వాహనాల రాకతో కనుమరుగు • తయారీదారుల స్థితి దయనీయం



దాకమర్రి గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న బండి చక్రాలు

తగరపువలస: సమయంతో పాటు పరుగులు తీస్తున్న నేటి స్పీడ్ యుగంలో ఎడ్ల బళ్లు దాదాపు కనుమరుగయ్యాయి. సాంకేతిక పరిజ్ఞానం అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో ఇవే ప్రధాన రవాణాసాధనాలుగా ఉండేవి. మోటారు వాహనాల రాకతో ఎడ్ల బళ్లు వెనుకబడ్డాయి. రవాణాలో కీలక పాత్ర పోషించే ఎద్దులు, పోతులను ప్రత్యామ్నాయంగా వ్యవసాయంలో దున్నటానికి, మోటబావిలో నీరు తోడటానికి, ఎరువులు, విత్తనాలు, పంట రవాణాలో వినియోగించేవారు. వీటికి ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్లు, మినీ వాహనాల రావడంతో దాదాపు ఎడ్ల బళ్లు కనుమరుగైపోయాయి. ప్రస్తుతం ఈ బళ్లు, వాటి చక్రాలు అలంకరణ వస్తువులుగా, గ్రామదేవతల తీర్థాలలో రథోత్సవాలకు, సినిమా షూటింగ్‌లలో మాత్రమే కనిపిస్తున్నాయి.



ఆనందపురంలో ఒక హోటల్ ముందు అలంకరణగా ఉంచిన ఎడ్లబండి

పూర్వకాలం నుంచి ఎడ్ల బళ్ల తయారీకి భీమిలి మండలం పేరు గాంచింది. ముఖ్యంగా దాకమర్రి, మజ్జిపేట పంచాయతీలతో పాటు దీనిని ఆనుకుని విజయనగరం జిల్లా డెంకాడ మండలం జొన్నాడలో మాత్రమే వీటిని తయారు చేసేవారు. ప్రస్తుతం వీటి ఆనవాళ్లు దాకమర్రి గ్రామంలో నివసిస్తున్న కానూరి అమ్మాజీ, పైడిరాజు దంపతుల వద్ద కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో ఎక్కడ షూటింగ్ జరిగినా, రథోత్సవాలు జరిగినా వీరినే వెదుక్కుంటూ వస్తుంటారు. పైడిరాజు తండ్రి అప్పలస్వామి, చిన్నాన్నలు సూర్యనారాయణ, ఆదియ్య ఎడ్ల బండ్ల తయారీలో అందె వేసిన చేయి. వీరి వద్ద కొందరు పనికి వస్తుండేవారు. 24 గంటలూ పనిచేసినా ఆర్డర్లు అందించలేనంత పని వీరి చేతి నిండా ఉండేది. వారి వారసత్వం పైడిరాజుకు మాత్రమే వచ్చింది. ఆయన వయసు సహకరించకపోవడంతో పాటు పదేళ్ల క్రితమే బండి పూర్తిగా కనుమరుగు కావడంతో వాటి విడి పనిముట్లే జ్ఞాపకాలుగా పైడిరాజు దంపతులు ఒంటరిగా జీవిస్తున్నారు. కుమార్తె, కుమారుడు పెళ్లిళ్లు చేసుకుని, పొట్ట చేతపట్టుకుని **నగరంలో నివ**సిస్తుండగా గ్రామస్తులే వీరికి తోడుగా ఉంటున్నారు.

నాడు రూ.10 వేలతో బండి రెడీ



బండి విడిభాగాలైన కుంచాలు, రేకులు, పూటీలు, ఇరుసులు

తుమ్మ, వేగిశ కలపను ఉపయోగించి ఎడ్లబళ్లను **తయా**రు చేసేవారు. వీటితో బండి తయారీలో నిలు**వు**గా ఉండే పూటీలు, బండి లాగే ఎద్దుల మెడపై అడ్డంగా ఉండే పూజు, చక్రాల తయారీలో రేకులు, అడ్డ చెక్కలు, కుంచాలు తయారు చేస్తారు. చక్రం చుట్టూ కమ్ములు, ఇరుసులు, కుంచం తయారీలో ఇనుమును చక్రంతో తిప్పి నిప్పులపై కాల్చి దాగలిపై మలిచేవారు. బండ్లతో పాటు విడి పనిముట్లు కొనుగోలుకు ఎక్కువగా సాలూరు, బొబ్బిలి, రామభద్రాపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చేవారు. అప్పట్లో రూ.**వెయ్యి** మొదలుకుని రూ.10వేలతో బండి తయార**య్యేది.** ప్రస్తుతం బండి తయారీకి రూ.50 వేల నుంచి **రూ.60వేల** ఖర్చు అవుతుంది. ప్రస్తుతం పైడిరాజు ఇంటి వద్ద ఉన్న మెటీరియల్‌తో రూ.7500తో రథం తయారు చేసి, రూ.1000 నుంచి రూ.3 వేల విలువైన చక్రాలు షూటింగ్‌లకు ఇస్తున్నారు. ఒక్కోసారి ఉచితంగా కూడా అందిస్తున్నారు.

కలప అంతా పాడైపోయింది



పూర్వం గ్రామాలలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగేవి. చేతి నిండా పని ఉండేది. కొందరిని పనిలో పెట్టుకుని ఆర్డర్లు తీసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ వైభవం పోయింది. నిల్వ ఉంచిన కలప అంతా చెదలు పట్టిపోయింది. ఎవరైనా అవసరం కోసం అడిగితే రథాలు, చక్రాలు ఇస్తున్నాం. గతంలో కళకళలాడిన ఈ ప్రాంతం నేడు వెలవెలపోతోంది.

– కానూరి పైడిరాజు, బళ్ల తయారీదారుడు, దాకమర్రి

పదెకరాలు పోయింది



గతంలో మా కుటుంబం బండ్ల తయారీతో ఖాళీ లేకుండా ఉండేది. మా కుటుంబ సభ్యులకు పది ఎకరాల పంట భూములు ఉండేవి. విచిత్రంగా పెట్టుబడుల రూపంలో ఆవిరి అయిపోయాయి. చివరకు డ్వాక్రాలో తీసుకున్న రుణం రూ.1.50 లక్షలు కూడా బళ్ల తయారీలోనే పోయింది. దర్జాగా బతికిన చోట దయనీయంగా బతుకుతున్నాం. – కానూరి అమ్మాజీ, దాకమర్రి

విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవరచుకోవాలి



కల్నల్ రాంబాబును సన్మానిస్తున్న పూర్వ సైనిక సేవా పరిషత్ ప్రతినిధులు

తగరపువలస: విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవరచుకోవాలని అఖిల భారత పూర్వ సైనిక సేవా పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కల్నల్ పాలేటి రాంబాబు అన్నారు. ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలోని హార్వర్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు డిఫెన్స్ గురించి జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనకు అన్నింటికంటే దేశం ముఖ్యమని గుర్తించాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సైన్యంలో చేరేందుకు చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు కేపీ పాండే మాట్లాడుతూ పహల్గాం యుద్ధం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఎన్‌సీసీ వైస్ ప్రెసిడెంట్ మమతా త్రిపాఠి, సేవా పరిషత్ వైస్ ప్రెసిడెంట్ అగ్గాల హనుమంతరావు, సంజయ్‌సింగ్, వరప్రసాద్, గౌరినాయుడు, గోవిందరావు, రామకృష్ణ , హార్వర్ అకాడమీ సీఈవో రఘురాజు, ప్రిన్సిపాల్ ఎస్.గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించిన ఇద్దరిపై కేసులు

సాక్షి ఎఫెక్ట్..



సర్వే నెం.153/2లో గల ప్రభుత్వ భూమిలో విచారణ చేపడుతున్న రెవెన్యూ అధికారులు

మధురవాడ: ప్రభుత్వ భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వివరాలివి.. విశాఖ రూరల్ మండలం కొమ్మాది రెవెన్యూ గ్రామం సర్వే నెం.153/2లో సుమారు రూ.10కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు స్థానిక టీడీపీ నాయకులు స్కెచ్ వేశారు. ఇక్కడ వీరు స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడమే కాకుండా కొంతభూమిని సాగుకు సిద్ధం చేశారు. ఇక్కడ ఏర్పాటుచేసిన హెచ్చరికబోర్డులను కూడా తీసేసి భూమిని ఆక్రమించడంపై గత నెల 26వ తేదీన సాక్షి దినపత్రికలో 'యథేచ్ఛగా భూకబ్జా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ స్పందించారు. సర్వే నెం.153/2లో 3.92 ఎకరాల ప్రభుత్వ భూమిలో 2.80 ఎకరాల భూమిని ఆక్రమణకు సిద్ధం చేయడంతో కఠిన చర్యలు చేపట్టారు. ఆర్ఐ కిషోర్, సర్వేయర్ ప్రసాద్ ఫీల్డ్ విజిట్ చేసి ఆక్రమణను నిర్ధారించారు. గ్రేడ్–2 వీఆర్వో గబ్బాడ శ్రీను పీఎం పాలెం పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేయడంతో బైపిల్లి సుందరరావు, బైపిల్లి శ్రీరామన్నారాయణలపై కేసు నమోదు చేశారు.

లోక్ అదాలత్‌లో 843 కేసుల పరిష్కారం



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మేజిస్ట్రేట్ స్వాతి భవాని

భీమునిపట్నం: భీమిలిలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 843 కేసులు పరిష్కారమయ్యాయి. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మేజిస్ట్రేట్ పి. స్వాతి భవాని ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మేజిస్ట్రేట్ డి.సౌజన్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇందులో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ల పరిధికి సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి. అలాగే వివిధ అపరాధ రుసుముల ద్వారా రూ.1.85కోట్ల 38,164 రూపాయలు వచ్చాయి. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎన్.జనార్ధనరావు, లోక్ అదాలత్ సభ్యులు ఎం.వి. పార్వతీశం, పి.వాయునందన, డి.ఈశ్వరరావు, శంకర్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణపై డీపీవో ఆకస్మిక తనిఖీ



రేఖవానిపాలెంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం, మూలకుద్దు పంచాయతీలలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం జిల్లా పంచాయితీ అధికారి ఎం.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 7 గంటలకు మూలకుద్దు చేరుకుని గ్రామస్తుల నుంచి పారిశుధ్య సిబ్బంది నుంచి చెత్త సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్దే చెత్తను వేరు చేసి, పారిశుధ్య సిబ్బందికి ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొయ్య రామకృష్ణారెడ్డి, సమ్మిడి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు రామారావు, గాయత్రి పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల దరఖాస్తుల స్వీకరణకు నేడు విరామం

తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం బకాయిల విషయమై కార్మికుల నుంచి ఈ నెల 2 నుంచి చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు ఆదివారం విరామం ప్రకటించింది. సోమవారం నుంచి యథావిధిగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు నాలుగు రోజుల పాటు కార్మికుల నుంచి 289 దరఖాస్తులు రాగా, వాటిలో ఎక్కువగా పీఎఫ్ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయి. వీటిని పీఎఫ్ కమిషనర్ కార్యాలయానికి పంపించనున్నట్లు మిల్లు ప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించాలి

తగరపువలస: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కు తీసుకోవాలని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ ఏఈ బొట్టా రవికి వినతిపత్రం అందించారు. అనంతరం నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, సన్నిబాబు, లక్ష్మణరావు తదితరులు మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలపై అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

కూల్చిన ఆక్రమణల స్థానంలో మళ్లీ నిర్మాణాలు

- నకిలీ పట్టాలతో విక్రయాలు
- 'రెవెన్యూ' సహకారంతోనే అని ఆరోపణలు



ఫిబ్రవరి రెండోవారంలో రెవెన్యూ అధికారులు కంటి తుడుపుగా తొలగించిన నిర్మాణాలు(ఫైల్)



ప్రస్తుతం అదే స్థలంలో దర్జాగా ప్రహరీ, గేటుతో సహా వెలసిన నిర్మాణాలు

తగరపువలస: ఆనందపురం మండలానికి తహసీల్దార్ నియామకంలో జాప్యం కారణంగా కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలాలు, గెడ్డలు ఆక్రమించి రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్నారు. విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి విక్రయానికి పెడుతున్నారు. ఆక్రమణలకు పాల్పడుతున్న కూటమి నాయకులకు రెవెన్యూ విభాగంలో కొందరు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వివరాలివి..

గంభీరం పంచాయతీ సర్వే నంబర్ 173లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక గెడ్డ స్థలంపై కూటమి నాయకుల కన్ను పడింది. రెవెన్యూ అధికారుల సాయంతో గెడ్డను పూడ్చి రాత్రికి రాత్రి పునాదులు వేశారు. ఇందుకు సహకరించిన రెవెన్యూ సిబ్బందికి అడ్వాన్స్ కింద రూ.2 లక్షలు కొట్టారు. స్థానికులు అభ్యంతరం తెలిపినా ఖాతరు చేయకుండా రెండు రోజుల్లోనే షెడ్లు కట్టేశారు. దీంతో ఫిబ్రవరి 7న 'కూటమి నాయకుల చెరలో గెడ్డవాగు' శీర్షికతో, అదే నెల 10న ' గెడ్డవాగులో వెలసిన షెడ్లు' శీర్షికతో వరుసగా సాక్షిలో వార్తలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు వెంటనే జేసీబీ సాయంతో గెడ్డలో షెడ్లు కూల్చేశారు. కానీ అక్రమ నిర్మాణాలు తొలగించిన చోట హెచ్చరికల బోర్డులు పెట్టకుండా వదిలేశారు. సరిగ్గా అయిదు నెలల విరామం అనంతరం అదే గెడ్డ ప్రదేశంలో దర్జాగా షెడ్లు, ప్రహరీ నిర్మించడమే కాకుండా గేటు కూడా ఏర్పాటు చేశారు.

'రెవెన్యూ'కు వాటాలు?

ఈ పంచాయతీలో నకిలీ పట్టాలు కూడా చలామణిలో ఉన్నందున వీటి సాయంతో షెడ్లు, ప్రహరీ నిర్మాణం చేపట్టిన చోట 60 గజాలలో నిర్మించిన షెడ్డును రూ.15 లక్షల వంతున మూడు షెడ్లను మొత్తం రూ.45 లక్షలకు విక్రయించినట్టు భోగట్టా. దీంతో రెవెన్యూ సిబ్బందికి మూడో వాటా ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గెడ్డ ఆక్రమణలు తొలగించి నిర్మించిన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవడంతో పాటు నకిలీ పట్టాలపై విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా తహసీల్దార్ నియామకం జరగకపోతే ప్రభుత్వ స్థలాలు, గెడ్డలను కూటమి నాయకులు పప్పు, బెల్లాల వలే వాటాలు వేసి విక్రయించేస్తారని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సాగర్‌నగర్‌లో చోరీ



చోరీకు గురైన దుకాణం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. జనార్ధన్ అనే వ్యక్తి ఇక్కడ టిఫిన్ సెంటర్‌తో పాటు పాన్‌షాప్ నిర్వహించుకుంటున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా తన టిఫిన్ సెంటర్‌ను తెరిచేందుకు రాగా, అప్పటికే దుకాణం తలుపులు తెరచి, దుకాణంలో వస్తువులు చిందరవందరగా ఉండటం గమనించాడు. రెండు సిలిండర్లు, ఒక పొయ్యి, ఇతర సామగ్రి పోయినట్లు ఆయన తెలిపారు. సుమారు రూ. 20 వేలు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెం జాతీయ రహదారిపై శనివారం వేకువజామున ఓ లారీని ఇంకో లారీ ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి రొయ్యల లోడుతో లారీ ఆనందపురం వైపు వస్తోంది. టీ తాగడం కోసం డ్రైవర్ గుమ్మడిపాలెం రోడ్డు పక్కన లారీని నిలిపాడు. అదే సమయంలో మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయల లోడుతో ఆనందపురం వైపు వస్తున్న లారీ రొయ్యల లోడు లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఉల్లిపాయల లోడు లారీ ముందుభాగం దెబ్బతింది. అందులో ఉన్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా పూజ



కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ప్రధాన వైద్యాధికారిగా డా. సీహెచ్ పూజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తగరపువలస నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. రోగులకు అందుబాటులో ఉండి, సేవలందిస్తానన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: అధికారులందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా వచ్చిన కార్యదర్శులు విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలన్నారు. విజయనగరం–శొంఠ్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గోతులు పూడ్చాలని, ఉపాధి హామీ ద్వారా నాటిన మొక్కల రక్షణకు గార్డులు ఏర్పాటు చేయాలని కోరారు. గంధవరం సర్పంచ్ జీవీకేకే వర్మ అలోపాలో గెడ్డ వద్ద బ్రిడ్జి పూర్తయ్యేవరకు డైవర్షన్ రోడ్డు బాగుండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా పద్మనాభం మండలం నుంచి బదిలీపై వెళ్లిన, మండలానికి కొత్తగా వచ్చిన ఉద్యోగులను ఎంపీపీ సన్మానించి, మెమెంటోలు అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు

కొమ్మాది: 'సూపర్‌సిక్స్ అన్నారు.. పంగనామం పెట్టారు' .. 'కూటమి పాలనలో రోజుకో అఘాయిత్యం–గంటకో నేరం'.. 'బాబుపాలనలో రక్షణ లేదు భిక్షణే..' అంటూ వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు నినదిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మ్యానిఫెస్టో గుర్తుకుతెస్తూ రుషికొండ ఏ1 గ్రాండ్‌లో శనివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశానికి భీమిలి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు వివిధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ, చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. మహిళలు ప్లకార్డులతో నినాదాలు చేశారు.